

## ఘనంగా బక్రీద్ వేడుకలు



ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మీనార్ మసీదు ఆధ్వర్యంలో మైనుద్దీన్ షాదీఖానాలో బక్రీద్ పండుగ శనివారం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పేదలకు సాయం అందించాలని మత పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ రఫీ, జమాత్ సభ్యులు షరీఫ్ కమిటీ సభ్యులు సర్దార్ ఇతర ముస్లిములు పాల్గొన్నారు.

# అమ్మకి దక్కని భరోసా

- ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులకు వెనకడుగు
- పట్టణ ప్రాంతాల్లో 'ప్రయివేటు' వైపు చూపు
- ఊరట ఇవ్వని కేంద్ర, రాష్ట్ర పథకాలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వం వైద్య సేవలపై గర్భిణులకు భరోసా లభించడంలేదు. పలు పథకాల పేరుతో ప్రోత్సాహకాలు అందిస్తున్నా ప్రసవాల శాతం 50 శాతానికి మించడం లేదు. జిల్లాలో పిహెచ్‌సిలు 36, సిహెచ్‌సిలు 6, ఏరియా ఆస్పత్రులు 15, రాజమహేంద్రవరంలో ఒక జనరల్ ఆస్పత్రి ఉన్నాయి. మరో 300 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం ప్రతి నెలా జిల్లాలో సుమారుగా 2,100 ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 50 శాతం కూడా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరగట్లేదు. ప్రజల్లో సర్కారు దవాఖానాలపై ఉన్న అపనమ్మకమే ఈ దుస్థితికి కారణంగా తెలుస్తోంది. గ్రామీణ స్థాయిలో ఉండే చాలామందిలో ప్రభుత్వ వైద్య విధానంపై చికిత్స సరిగ్గా ఉండదని కొందరు, వైద్య సౌకర్యాలు సరిగ్గా ఉండవని మరికొందరు, సిబ్బంది నిర్లక్ష్యం వంటి కారణాలతో మరికొందరు వెనకడుగు వేస్తున్నారు. కాన్పు కోసం ఆసుపత్రులకు పంపుతున్న సమయంలో నొప్పులు రావడంలేదంటూ వైద్యులు వారిని వెనక్కి తిప్పి పంపడం కూడా మరో కారణమని బాధితులు చెబుతున్నారు.

**ప్రోత్సాహకాలు ఉన్నా ...ఫలితం నామమాత్రమే**

ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా ప్రసవాలు చేయడంతో పాటు కాకుండా.. మూడో నెల నుంచి పౌష్టికాహారం, డెలివరీ అనంతరం బేబికిట్‌లు కింద కొంత నగదుతో పాటు బిడ్డల సంబంధించిన పలు రకాల సంరక్షణ వస్తు వులను ప్రభుత్వం అందజేస్తామంటూ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. అదే విధంగా ప్రసవం అనంతరం తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ పేరుతో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తోంది. గర్భం దాల్చినప్పటినుంచి వారికి పౌష్టికాహారం అందిస్తూ, అవసరం మేరకు వైద్యసేవలు, రక్త, తదితర పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా 9వ తేదీ స్కానింగ్, కామెర్లు, హెచ్‌ఐవి తదితరల పరీక్షలన్నీ నిర్వహిస్తున్నామని వైద్య శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. పిహెచ్‌సిల్లో సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అంటే బెదురు మాత్రం తగ్గడం లేదు. అయితే సిహెచ్‌సిలలో పూర్తి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఆసుపత్రుల్లో ప్రసవానికి వచ్చిన వారికి డెలివరీ చేసేందుకుగాను సీనియర్ వైద్యులు సమయానికి అందుబాటులో ఉండటంలేదన్న ఆరోపణలు వినిపి స్తున్నాయి. తీరా వారు వచ్చే సమయానికి ప్రసవానికి వచ్చిన గర్భిణికి నొప్పులు తీవ్రం కావడం, కింది స్థాయి సిబ్బంది అవగాహన లేమితో వైద్య సేవలందించడం వంటి కారణాలతో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులకు రాకపోవడానికి కారణాలేంటి? ఎందుకు భయపడుతు న్నారు? వచ్చిన వారిని సాధారణ ప్రసవాలకు ఎలా సిద్ధం చేయాలి? తదితర అంశాలపై కసరత్తు చేయాల్సిన అవసరం ఉంది.

**ప్రయివేటు ఆసుపత్రుల్లో దోపిడీ**

ప్రజల భయాందోళనలను అసరాగా మార్చుకుని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు దోపిడీకి తెరలేపుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులకు మొగ్గుచూపుతున్న వారిలో అత్యధికంగా సామాన్య మధ్య తరగతి ప్రజలే ఉంటున్నారు. రాజమహేంద్రవరం, నిడదవోలు పట్టణాలల్లోసౌకర్యాల పేరుతో కాన్పుకు రూ.80వేల నుంచి రూ.1లక్ష వసూలు జరుగుతోంది. అత్యాధునికమైన వైద్యం అందిస్తారనే ఆశతో అనేక మంది ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే సాధారణ కాన్పుకు అవకాశం ఉన్నప్పటికీ సిజేరియన్ చేస్తున్నారనే విమర్శలూ విన్పిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేయిస్తు న్నారని తమకు చిన్నతనంగా ఉంటుందన్న అభిప్రాయంతో కొందరు, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీకి తీసుకెళ్తే అక్కడ జరగకూడనిది ఏదైనాజరిగితే బంధు వుల దగ్గర, గ్రామస్థుల దగ్గర తలెత్తుకోలేమన్న భయం తో మరికొందరు కాన్పుకు నగదు వెచ్చిచ్చేందుకు వెనకాడటం లేదు. ఇంకొందరు అయితే వారు చెప్పిన సమయానికే డెలివరీ చేయాల్సి రావడంతో ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. దాన్నే అదునుగా చేసుకుంటున్న పలు ప్రైవేటు ఆసుపత్రుల వారు అందినకాడికి దండుకుని కోతలు కోసి కాన్పులు చేస్తున్నారు.

### ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లక తప్పలేదు

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో తొలుత డెలివరీ డేట్ ఇచ్చారు. కానీ తీరా వారిచ్చిన డెలివరీ సమయానికి వెళితే.. నొప్పులు రావడం లేదు కదా.. కొన్ని రోజులు ఆగాలని చెప్పారు. ఇంటికి వెళ్లి రెండు రోజులు ఆగాక నొప్పులు వచ్చినప్పుడు రమ్మన్నారు. ప్రసవం కోసమని బయలుదేరి వచ్చాక తర్వాత రమ్మని చెప్పడంతో చేసేది లేక ప్రయివేటు ఆసుత్రిలో చేరాను.

**- జి.రమాదేవి, గర్భిణి, రాజమహేంద్రవరం**

# విద్యుత్ మోత , పన్నుల వాత

**కూటమి ఏడాది పాలన బాదుడే బాదుడు**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం తొలి వార్షికోత్సవం నేపథ్యంలో పట్టణ ప్రజలపై ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీల భారం వేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమా మహేశ్వరరావు విమర్శించారు. ఇన్నీసుపేట అల్యూ మినియం హాల్లో సిపిఎం జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలోని 123 పట్టణాలు, నగరాల్లోని 40.22 లక్షల గృహాలు, ఇతర కట్టడాల సర్వే మున్సిపల్ అధికారులు ప్రారంభించారన్నారు. 20శాతం ఇంటి పన్ను పెంపు లక్ష్యంగా ఈ సర్వే సాగుతోందన్నారు. రాజమండ్రి నగరంలో రూ.15.78 కోట్ల బాదుడుకు టార్గెట్ నిర్దేశించారన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వం వార్షికోత్సవ కానుక అని ఎద్దేవా చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి 15శాతం ఇంటి పన్నులు పెంచారని, దానికి అదనంగా మరో 20 శాతం బాదుడుకు సిద్ధమయ్యారని విమర్శించారు. మే 14న మున్సిపల్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ కమిషనర్లకు మెమో ద్వారా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జూన్ 15 నాటికి ఈ సర్వే చేసి, కొలతలు తీసుకుని పన్నులు పెంచాలని నిర్ణయించారన్నారు. గతంలో కేంద్రలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాల మేరకు వైసిపి ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధించే నూతన చట్టాన్ని తెచ్చి జిఒ 198 విడుదల చేసిందన్నారు. దీన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. దీంతో ఏడాదికి 15 శాతం మాత్రమే పెంచుతామని నాడు ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. ఆస్తి విలువ ఆధారిత విధానం రద్దు చేయాలని కోరినా గత ప్రభుత్వం మొండిగా నిరాకరించిందన్నారు. ఐదేళ్లలో ఇంటి పన్ను రూ.1,188 కోట్ల నుంచి రూ.2137 కోట్లకు (80 శాతం) పెంచారన్నారు. టిడిపి, కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నుల భారాలు వేయబోమని హామీ ఇచ్చారన్నారు. కాని కూటమి ప్రభుత్వం మాట తప్పి నమ్మకద్రోహం చేసిందన్నారు. కనీసం ప్రజలకు సమాచారం చెప్పకుండా ఏప్రిల్ నుంచి 15శాతం ఇంటి పన్ను పెంచారన్నారు. ఇంతటితో ఆగకుండా ఇప్పుడు మరో 20 శాతం తగ్గకుండా పన్నులు పెంచడానికి ఆదేశాలిచ్చారన్నారు. సర్వే ద్వారా అదనంగా చిన్న గది కట్టినా, రేకుల షెడ్డు నిర్మించినా, చిరు వ్యాపారం చేసుకుంటున్నా నిబంధనల సాకు చెప్పి మొత్తం ఆస్తి విలువ ఆధారంగా ఆ ఇంటి పన్ను పూర్తిగా మార్చుతారని తెలిపారు. ఇంటి ప్లాను లేకపోయినా, ప్లాన్ ఉండి అదనపు నిర్మాణాలు చేసినా 25 శాతం నుంచి 100శాతం అదనపు పెనాల్టీ ప్రతి సంవత్సరం విధిస్తారన్నారు. పేదలు ప్రభుత్వ స్థలాలలో దశాబ్దాల నుంచి నివసిస్తున్న వారివి అక్రమ కట్టడాలుగా ముద్ర వేసి వారికి 100శాతం పన్ను పెంచుతారన్నారు. ప్రతి ఇంటికీ 15శాతం పెంపుకి పరిమితం కాకుండా పూర్తిగా ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్ను పెరుగుతుందన్నారు. ప్రభుత్వం పన్నులు లేని వారికి పన్నులు వేస్తున్నామని, పన్నులు తక్కువగా ఉన్న వారికి సరిచేస్తున్నామని కుంటి సాకులు చెబుతున్నదని కానీ ప్రతి ఇంటికి కొలతలు వేస్తూ, ముందుగానే ప్రతి మున్సిపాలిటీలో ఎంత పన్ను పెంచాలో లక్ష్యాలు నిర్ణయించారన్నారు. తక్షణమే ఈ భారాలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలను నేడు కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై ప్రజా రక్షణ భేరి నిర్వహించామన్నారు. దీనిలో అనేక సమస్యలు వచ్చాయని వాటిపై భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పవన్, పి.తులసి, జిల్లా కమిటీ సభ్యులు కర్రి రామకృష్ణ, సుందర్ బాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, బేబీరాణి, సుబ్రహ్మణ్యం, రాజా తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి -కొవ్వూరు

నియోజక వర్గం పరిధిలో వివిధ ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న నలుగురికి రూ.4,99,189 విలువైన చెక్కులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం అందజేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు ఆంధ్ర సుగర్స్ ఎమ్‌డి పెండ్యాల అచ్చిబాబు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర చేతుల మీదుగా వీటిని అందించారు. పసివేదల గ్రామానికి చెందిన సిహెచ్ రామ్మోహన్‌కి రూ.1,83,994, డొక్కు ముత్యాలరావుకు రూ.1,42,969 చిక్కాలకు చెందిన కారింకి దామోదరంకు రూ. 92,226లు, జక్కు ఉమాదివ్యకి రూ.80వేలు విలువ చేసే చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిములకు కలెక్టర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బక్రీద్ నేపథ్యంలో కలెక్టర్ పి.ప్రశాంతి ముస్లిములకు శనివారం బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని, ఈ పర్వదినం శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ మానవతా విలువలు, త్యాగం, సహనము, సామాజిక సమానత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొవ్వూరు

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు పోలీసులు సిబ్బందని ఆదేశించారు. కొవ్వూరు సర్కిల్ పరిధిలో శనివారం ఆయన పర్యటించారు. కొవ్వూరు డిఎస్‌పి కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి కేసుల పురోగతి గురించి ఆరా తీశారు. ఆయన వెంట కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ తదితరులున్నారు.



డిఎస్‌పి కార్యాలయంలో అడిషనల్ ఎస్‌పి

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

**నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు**
**రూ.లక్షలు ప్రభుత్వాదాయానికి గండి**

ప్రజాశక్తి -దేవరపల్లి

అధికార పార్టీ హయాంలో మట్టి మాఫియా చెరువుల్లోని మట్టిని తోడేస్తుంది. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన ఓ టిడిపి నాయకుడు ఆధ్వర్యంలో 900 ఎకరాల్లో విస్తరించి వున్న ఆవ చెరువులో సుమారు పది రోజులుగా నిర్విరామంగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. రైతు పేరున 2వే క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలను అనుమతులు తీసుకుని 30వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టిన తవ్వేశారని తెలిపారు. వందలాది ట్రాక్టర్లతో ప్రతి రోజూ మట్టి తరలిపోతుందన్నారు. ఫలితంగా లక్షలాది రూపాయాలు ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతుందన్నారు. ఈ అక్రమ తవ్వకాలపై అధికారులకు ఫోన్లు చేసినను ఎవరూ స్పందించట్లేదని స్థానికులు తెలిపారు. వరుసగా మూడు రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో తవ్వకాలను ముమ్మరం చేశారని స్థానికులు తెలిపారు. మట్టి తవ్వకాలను అరికట్టకుంటే రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయి పెను ప్రమాదం వాటిల్లుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



ట్రాక్టర్‌పై తరలిపోతున్న మట్టి

దీనిపై జిల్లా ఇరిగేషన్ అధికారులను వివరణకోరగా, గాంధీనగరానికి చెందిన రైతు అభ్యర్ధన మేరకు తన పంటచేలల్లోకి మట్టి తోలుకునే నిమిత్తం 2000 క్యూబిక్ మీటర్లకు లోబడి వ్యక్తిగత అనుమతులు మంజూరు చేశామన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఐక్య వేదిక నాయకులు

## మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్‌ను మాన్యువల్‌గా నిర్వహించాలని ఉపాధ్యాయుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఎంఇఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యూనియన్లకు రాష్ట్ర ఉన్నతాధికారులకు జరిగిన చర్చల్లో భాగంగా సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను మ్యాన్యువల్‌గా జరపడానికి ఒప్పుకున్నారన్నారు. కాని నేడు వెబ్ ద్వారానే మాత్రమే బదిలీలు జరుపుతామని ఏకపక్షంగా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. టీచర్స్‌తో బలవంతంగా వెబ్ ఆప్షన్స్ పెట్టించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో డిఇఒ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఈవీఎస్ఎస్ఆర్ ప్రసాద్ ,జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి శ్రీనివాస్, ప్రకాష్ ,పద్మజ, రాజు, ప్రసాద్ , జిలానీ తదితరులు హాజరయ్యారు.

# జూనియర్ ఇంటర్‌లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపిసి విభాగంలో 470కి 467 మార్కులు 24 మంది విద్యార్థులు సాధించారాన్నరు. సిహెచ్.సందీప్, బత్తుల తన్మయిరిత్విక, ఆర్.పూర్ణిమ సంతోషి, పి.హేమంత్, ఎస్.వీర్షితఅక్షయ, వి.మణికంఠ, ఉప్పుగుండ్ల విరోనిక, మోక జెన్నిబాబు, ముత్యాల హర్షిత, సింగులూరి తేజ, ముమెనున్నీషా ఖాన్, పర్చూరి పునీత వెంకటసాయి, కిల్లంపల్లి రేవతి దేవి, జె.గోపిక ధమని, వడ్డి జ్వలిత సాయి శివవాణి, మద్దు సూర్యదేవ్, కె.సత్యప్రియ, గెడ్డం రాజనవీన్‌తేజ, దాడి దినేశ్వర్, ఎ.వీర వెంకట సాయి లిఖిత,






కేశన తపశ్వి, డి. దీపిక, కొవ్వూరి హాసిని, దీప్తిమహంతి సాత్విక్ 467 మార్కులు సాధించారన్నారు. 466 మార్కులు పైన 155 మంది, 465 మార్కులు పైన 506 మంది, 463 మార్కులు పైన 1224 మంది, 460 పైన 1775 మంది, 450 పైన 2604 మంది సాధించారని ఆయన తెలియజేశారు. బైపిసి విభాగంలో 440కి 437 మార్కులను మహ్మద్ మనీష, గంగేయుల కృష్ణ చందన, కాడ గాయత్రి, గంపల వీర వెంకట లక్ష్మణ్ సాధించారని, 435 పైన 90 మంది, 430 పైన 292 మంది, 400 పైగా మార్కులు 501 మంది సాధించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమల రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జుల రాజీనామా

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం నియోజకవర్గ టిడిపి క్లస్టర్‌లో 1, 56వ బూత్ ఇన్‌ఛార్జులు గద్దె వెంకట సురేష్, వాకలపూడి రామకృష్ణ రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారు టిడిపి రాజానగరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరికి రాజీనామా లేఖలను సమర్పించారు. టడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశామని, గత ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశామని లేఖలో పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో తాను సమర్థవంతంగా పనిచేస్తాననే నమ్మకం లేదని గద్దే వెంకట సురేష్ తన లేఖలో తెలిపారు. ఆ స్థానంలో పార్టీ విజయం కోసం కృషి చేసే వ్యక్తిని నియమించాలని కోరారు. భవిష్యత్తులో తన స్థాయికి, సీనియారిటీకి తగిన అవకాశం పార్టీ కల్పిస్తుందని ఆశిస్తున్నట్లు లేఖలో తెలియజేశారు. వాకలపూడి రామకష్ణ మాట్లాడుతూ కొంత మంది ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా రాజీనామా చేస్తున్నానన్నారు. తాజా పరిణామాలపై స్పందిస్తూ, క్లస్టర్ 1 ఇన్‌ఛార్జి గద్దె సురేష్ రాజీనామా తనకు చాలా బాధ కలిగించిందని, దానికి మద్దతుగా తాను రాజీనామా సమర్పించినట్లు శివరామకృష్ణ తెలిపారు.

## కార్టూన్'నిజం'





# 'శ్రీమహతి'కి పురస్కారాల పంట

ప్రజాశక్తి - సీతానగరం

శ్రీమహతి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ప్రతిభా పురస్కారాల పంట పండించారు. రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రతిభా పురస్కారాలను అందిస్తుంది. ఈ ఏడు శ్రీ మహతి హైస్కూల్‌కి చెందిన ఐదుగురు విద్యార్థులు ఈ పురస్కారాలు సాధించి రికార్డు సృష్టించారని కరస్పాండెంట్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గంటా లక్ష్మీ ప్రసన్న, కొమలి జశ్మిత అను, సిహెచ్.శివప్రియ, ఎం.దుర్గగణేష్, కె.బాష్యంత్ ప్రతిభా పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారన్నారు. వీరంతా పదో తరగతిలో 590కి పైగా మార్కులు సాధించారన్నారు. ఈ అవార్డులతో పాటు, వారికి జూనియర్ ఇంటర్మీడియట్‌లో అడ్వాన్స్‌డ్ మెయిన్స్ ప్రోగ్రామ్‌లో చేరే అవకాశం కూడా కల్పించారు. ఈ సందర్భంగా ఐఐటి అకడమిక్ డైరెక్టర్ ఎఎస్.రామ్‌ప్రసాద్ విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు.

## జెఇఇ ర్యాంకర్ తేజకు మంత్రి, కలెక్టర్ అభినందన

**కడియం :** జెఇఇ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా 172వ ర్యాంకు సాధించిన నాగిరెడ్డి తేజచంద్రనారాయణను మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్‌డిఒ కృష్ణనాయక్ తదితరులు సత్కరించి అభినందించారు. ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన సన్నకారు రైతు శ్రీనివాస్ కుమారుడు తేజ ఇంత అద్భుతమైన ర్యాంకు సాధించడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేశారు. కడియపులంక సత్యదేవ నర్సరీలో శనివారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. ఇదే పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారంతా ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, సత్యదేవ నర్సరీ రైతు పుల్లాపెదసత్యనారాయణ, కొండ్రెడ్డి శ్రీనివాస్,ముద్రగడ జెమ్మి, తదితరులు ఉన్నారు.



తేజను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

## సాంకేతిక పరిజ్ఞానంతో సాగు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేపడితే లాభదాయకమని కలెక్టర్ పి.ప్రశాంతి రైతులకు సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ఆర్‌కెవివై 2024-25 పథకంలో 42 కిసాన్ డ్రోన్లకు 38 డ్రోన్లను మంజూరయ్యాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇప్పటికే 12 డ్రోన్స్ ఏర్పాటు చేశామన్నారు. మరో 12 డ్రోన్స్ స్థానిక ప్రజాప్రతినిధులు సమక్షంలో పంపిణీకి సిద్ధం చేశామన్నారు. చాగల్లు-1, గోపాలపురం-1, నల్లజర్ల-3, రంగంపేట-1, ఉండ్రాజవరం-1, తాళ్లపూడి-1, గోకవరం-2, సీతానగరం-1, దేవరపల్లి-1 డ్రోన్ అందిస్తామన్నారు. డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.9.80లక్షలు, విహంగ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ.9.81 లక్షలకు డ్రోన్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు ఐదుగురు సభ్యులు కలిగిన రైతు సిహెచ్‌సిలో సభ్యుల ఆమోదంతో ఒకరికి డ్రోన్ టెక్నాలజీ పైలట్‌గా శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, కనీసం ఇంటర్ అర్హత ఉండాలన్నారు. సిహెచ్‌సి సభ్యులు కిసాన్ డ్రోన్ గ్రూప్ పేరున బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. యూనిట్ ఖర్చులో 50శాతం బ్యాంకు రుణంతో యూనిట్‌ను గ్రౌండ్ చేయడం తప్పనిసరి అన్నారు. గ్రూపులోని ఇద్దరు సభ్యులు కన్వీనర్, కో-కన్వీనర్‌గా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాల్సి ఉంటుందన్నారు.

## గ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం





సీతానగరంలో జయరోహన్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రయిటర్ పెందుర్తి దేవదాసు ఆధ్వర్యంలో గ్యాస్ వాడకంపై శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరోహన్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు గ్యాస్ లీకేజీలను గుర్తించడం, అలాంటి సందర్భాల్లో తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, రెగ్యులేటర్, పైపుల నాణ్యత తనిఖీ, సిలిండర్ల నిల్వ పద్ధతులు వంటి అనేక అంశాలను వివరించారు. సురక్షితమైన గ్యాస్ వినియోగం కోసం ప్రతి ఇంటిలోనూ సరైన వెంటిలేషన్ ఉండాలన్నారు. గ్యాస్ సిలిండర్ల కొనుగోలు చేసే సమయంలో గడువు తేదీని పరిశీలించాలన్నారు. బిఐఎస్ మార్క్ ఉన్న ఉత్పత్తులనే వాడాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్‌లను కూడా తెలియజేశారు.

## నేరాలు ఘోరాలు

### పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం రావి చెట్టు సెంటర్లో ఒక భవనంలో శనివారం పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎం.అశోక్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ.3,400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

### పాము కాటుకు గురైన ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి కాజులూరు

పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఉపాధి కూలీ పాలిక నాగేశ్వర రావు (75) మృతి చెందాడు. స్థానిక ఉపాధి కూలీలు ఏపిఒ వెంకటలక్ష్మి చెప్పిన వివరాల ప్రకారం శనివారం ఉదయం స్థానికంగా ఉండే పంట కాలవ వద్ద ఉపాధి పనులు చేస్తుండగా నాగేశ్వరరావును తాచుపాము కరవడంతో సమీపంలో ఉన్న యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందాడని తెలిపారు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని ఎపిఒ వెంకటలక్ష్మి సర్పంచ్ చెరువూరి వెంకట సత్యనారాయణ రాజు పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌పై దాడి

ప్రజాశక్తి - కొవ్వూరు

వాడపల్లి గ్రామంలో టాటా క్యాపిటల్ లిమిటెడ్ మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ కె.తరుణ్‌కుమార్‌పై గెల్లా సతీష్ అనే వ్యక్తి దాడికి దిగాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాయిదాల వాసూళ్ల నిమిత్తం తరుణ్‌కుమార్ వాడపల్లిలో కస్టమర్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో కస్టమర్ పక్కింట్లో ఉంటున్న గెల్లా సతీష్ కలుగజేసుకుని నువ్వు ఏజెంట్ అనడానికి ఆధారాలు ఏవీ? అంటూ ప్రశ్నించాడు. అంతే ఆకుండా సెల్ ఫోన్ లాక్కుని తరుణ్‌కుమార్ తలపై కొట్టాడు. దీంతో తరుణ్‌కుమార్ తలకు రక్తపు గాయమైంది. తనను దుర్భాషలాడి కొట్టినట్లు పట్టణ పోలీసులకు తరుణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సి లలిత తెలిపారు.

### 11న ఆర్‌టిహెచ్ ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

యువతలో, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలలో, విద్యార్థుల ద్వారా ప్రతిపాదించే నూతన ఆవిష్కరణలకు ఆర్థిక, సాంకేతిక చేయూత నివ్వడం కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టిహెచ్)ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కాటంనేని భాస్కర్, పిఎస్.ప్రద్యుమ్న కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్నరాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఆర్‌టిహెచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. భవనాన్ని, ఇతర మౌలిక వసతులు కల్పించడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. జూన్ 10న సిఎం దీన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఆర్‌టిహెచ్‌కు లీడ్ పార్టనర్‌గా గ్రీన్‌కో నేతృత్వంలో వ్యవస్థీకరణ ప్రక్రియ చేపడతామన్నారు. ప్రమోటర్లు, ఐదుగురు ప్రతినిధుల అధ్యక్షులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో కూడిన బృందాని ఏర్పాటు చేవామన్నారు. హబ్ ప్రారంభోత్సవానికి ప్రభుత్వ, విద్యా సంస్థలు, పరిశ్రమ సంఘాల నుంచి ఇద్దరు చొప్పున ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. హబ్ ఏర్పాటు, నిర్వహణ విషయంలో సహభాగస్వామ్యం, కార్పస్ ఫండ్, రూ.30 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేశామన్నారు.

### ఎస్‌విఆర్‌కె విద్యార్థులకు అవార్డులు


ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో శ్రీవెలగపూడి రామకృష్ణ స్కూల్ విద్యార్థులు నాలుగు అవార్డులను గెలుచుకున్నారు. పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు అందిస్తుంది. మండలానికి మొత్తం ఆరు అవార్డులు రాగా వాటిలో ఐదు అవార్డులను ఎస్‌విఆర్‌కె విద్యార్థులు కైవసం చేసుకున్నారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ నందిగం వెంకటరామారావు, హెచ్‌ఎం కె.శ్రీహరినీలం శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, ఎన్.శ్యామ్, కె.కృష్ణజగన్నాథ్, కెహెచెఎన్‌ఎం మహాలక్ష్మి, షేక్ బక్షి, కె.స్వాతిసురేఖ, టి.శ్రీవాణి, కె.రవి, ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

### చిన్నారి కుటుంబానికి ఎంఎల్‌ఎ గోరంట్ల పరామర్శ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విద్యుదాఘాతంతో మృతి చెందిన చిన్నారి పోతూరి అక్షర కుటుంబాన్ని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం పరామర్శించారు. వారిని ఓదార్చి, అక్షర కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదే ప్రాంతానికి చెందిన దేవదాసి లిఖిత అనే మరో చిన్నారి కూడా ఈ ప్రమాదంలో గాయపడింది. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఎంఎల్‌ఎ ఆరా తీశారు. లిఖితకు విజయసాయి చిల్డ్రన్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చూస్తానని తెలిపారు. ధవళేశ్వరం పంచాయతీ సెక్రటరీ వెంకట్రావుతో మాట్లాడి ఆ రావిచెట్టు ఆరు అడుగుల ఎత్తు ఉండేలా కత్తిరించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ గోరంట్ల

# కూటమి హామీలకు ఏడాది

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ఏడాది పూర్తయినా ఆచరణలో అమలుకు నోచుకలేదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. తాజాగా కోనసీమ జిల్లాలో నిర్వహించి ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన విషయం విధితమే. అయితే ఈ నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేస్తామంటూ ఇచ్చిన హామీ కూడా అమలవుతుందో లేదో తెలీని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయినా ఓ వైపు హామీలు అమలుకు నోచుకోక పోవడం, మరోవైపు పెరుగుతున్న ధరలు అదుపులో లేకపోవడం వంటి పరిణామాలు ప్రజలతో పాటు కూటమి నేతల్లోనూ వ్యక్తమవుతోంది. మరోవైపు పులిపై పుట్రలా కూటమి నేతల్లో పదవుల పంపకాలలో అసంతృప్తి ఒకొక్కటిగా వెలుగులోకి వస్తుంది. తాజగా జరిగిన మహానాడు అసంతృప్తులకు వేదికగా మారింది. మరోవైపు రాష్ట్ర స్థాయి మహానాడుకు ఉమ్మడి జిల్లానుంచి అతి స్వల్పంగా కార్యకర్తలు తరలి వెళ్లారనే గుబులు అధికార పార్టీ ముఖ్య నేతల్లో ఇప్పటికే మొదలైంది. తాజాగా సీతానగరంలో ఇద్దరు ద్వితీయ శ్రేణి నాయకులు పదవులకు రాజీనామా చేసి అసంతృప్తిని వెళ్ల గక్కారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలు తలకిందులయ్యే పరిస్థితి ఖాయమనే ఆందోళన ఆ పార్టీలో నెలకొంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుతో పెరుగుతున్న ధరలకు, పన్నుల భారాలకు కళ్లెం వేయకపోతే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకోక తప్పదని తాజా పరిణామాలు మరోసారి హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ప్రభుత్వం ఏ మేరకు ఆత్మవిమర్శ చేసుకుని తిరిగి ప్రజాభిమానం చూరగొంటుందో వేచి చూడాలి మరి.

**తారాస్థాయిన్న ఎండలు**

భానుని ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణా కార్తె ప్రభావంతో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచే ఎండలు తారాస్థాయిన్నాయి. జిల్లాలో సరాసరి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరాయి.దీంతో మధ్యాహ్నం ప్రజలు బయటకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో జిల్లా కేంద్రాలతో పాటూ ప్రధాన కూడళ్లు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వేసవి తాపం నుంచి సేదతీరేందుకు ప్రజలు కొబ్బరి బోండాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. అయితే చలివేంద్రాలు ఏర్పాటు చేయటంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు వెనుకపడ్డాయి. దీంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ సైతం అప్రమత్తత లేకపోవటంతో అక్కడక్కడా వడదెబ్బ మృతులు నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి ప్రజారోగ్యం కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలి.

**విద్యావేత్త చిరంజీవినీకుమారి అస్తమయం**

ప్రముఖ విద్యావేత్త, ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఈ నెల 1న తుది శ్వాస విడిచారు. సాహితీ వేత్తగా, సామాజిక వేత్తగా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా ఆమె తెలుగు ప్రజలకు సుపరిచితులు. రచయితగానూ ఆమె రాణించారు. ఆంగ్ల అధ్యాపకరాలిగా ఆమె ప్రయాణం మొదలు పెట్టారు. ఎంఎ పట్టా అందుకున్న తరువాత రంగరాయ మెడికల్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేశారు. 1970లో ఐడియల్ జూనియర్ కాలేజీని స్థాపించారు. అదే ఒరవడిలో 1974లో డిగ్రీ కాలేజీని ప్రారంభించారు. 1980 ప్రాంతంలో వీటికి ప్రభుత్వ ఎయిడెడ్‌ను కూడా సాధించారు. కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాక అభ్యుదయ కార్యక్రమాలను నిర్వహించారు. 1980లో ఆల్ ఇండియా పీస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇదే కళాశాలలో మహాకవి శ్రీశ్రీ సప్తపతి ఉత్సవాలు కూడా జరిపారు. ఇస్కస్ తరపున భారతదేశ నుంచి 1970లో సోవియట్ యూనియన్ వెళ్లే అవకాశం వచ్చింది. ఈ బందానికి చిరంజీవిని కుమారి లీడర్‌గా వ్యవహరించారు. ఆర్మీనియాలో మాన్యా అనే రచయితతో అక్కడ పరిచయం ఏర్పడింది. ఆయన కథల పుస్తకం ఆమెతో పాటు తెచ్చుకుని ఇండియాకి వచ్చిన తర్వాత వాటిని ఆర్మేనియా కథలు పేరిట అనువదించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆవిర్భావ నుంచి ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారు. అరసం కార్యకలాపాలు తగ్గిన తర్వాత అదే బావ సారూప్యత కలిగిన వారితో కాకినాడలో తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేయడానికి కషి చేశారు. భారత జ్ఞాన విజ్ఞాన సమితి జిల్లా శాఖ అధ్యక్షురాలుగా, ఏపీ ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షురాలుగా, ఆంధ్రా యూనివర్సిటీ కళాశాల యాజమాన్య సంఘం అధ్యక్షురాలుగా, జిల్లా సాక్షరతా సమితి సభ్యురాలుగా, గిరిజన ప్రాంత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శిగా, ఇండియన్ సొసైటీ ఫర్ సోషల్ డైనమిక్స్ అధ్యక్షురాలుగా, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా ఇలా పలు సంస్థలలో ఆమె బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించారు.




**పనిగంటల పంపుపై కార్మికులు భగ్గు**

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బిజెపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పలకడంపై కార్మికులు, కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. తాజాగా 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంపద్ను సృష్టించేంది పారిశ్రామిక వేత్తలేనంటూ వక్రభాష్యం చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులపై పని భారం మోపడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# యోగాతో ఆరోగ్యం : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-కడియం

ప్రతి ఒక్కరూ నిత్యం యోగాను అభ్యసిస్తూ ఆరోగ్యంగా ఉండాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కడియపులంక శ్రీ సత్యదేవా (పుల్లా చంటియ్య ) నర్సరీ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా మంత్రి దుర్గేష్, రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చినరాముడు, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్ హాజరయ్యారు. అధికారులు, రైతులతో కలిసి యోగాసనాలు వేశారు. యోగాంధ్ర పేరిట ఏర్పాటు చేసిన మొక్కల కూర్పును తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని నెలరోజులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 21న విశాఖలో ఐదు లక్షల మందితో యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయని, ముఖ్యఅతిథిగా ప్రధాని మోదీ పాల్గొంటారన్నారు. యోగాంధ్రలో భాగంగా పచ్చని మొక్కలు, సుందర వనాల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందకరమన్నారు. థాయిలాండ్ నుంచి తీసుకొచ్చిన మొక్కను ఇక్కడ అభివృద్ధి చేసిన కొత్త రకం మామిడి వంగడానికి 'యోగాంధ్ర-11'గా మంత్రి నామకరణం చేశారు. మరో మామిడి వంగడానికి 'పిఎస్ఎన్-5గా ఎంఎల్‌ఎ గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి నామకరణం చేశారు. నూతన వంగడాలను అభివృద్ధి చేస్తున్న రైతు కుప్పాల దుర్గారావు, పుల్లా పెద్ద సత్యనారాయణలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఎంఐపి పీడీ దుర్గేష్, డిటిఒ వెంకటాచలం, డిహెచ్ఒ సుజాతకుమారి, డిఇఒ వాసుదేవరావు, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ సుధాకర్, ఇమ్యునైజేషన్ అధికారి పి.కోమలి, తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ రమేష్, హెచ్ఒ సుధీర్ కుమార్, ఎఒ ద్వారకాదేవి, సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

### త్వరలో శంకుస్థాపనలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో త్వరలోనే విద్యార్థులకు, పర్యాటకులకు, అటవీ సంరక్షణకు ఉపయోగపడేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరి మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖలతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు, బహిరంగ సభా వేదిక తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ముందుగా అనుకున్న ప్రకారం జూన్ 19న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉన్నందున అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం తేదీని మరలా ప్రకటిస్తామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరిలు ప్రధానంగా మూడు కార్యక్రమాలను ప్రారంభించనున్నారని తెలిపారు. అందులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బొమ్మూరులోని సైన్స్ మ్యూజియం ప్రారంభిస్తారని తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో అటవీ అకాడమీకి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫారెస్ట్, టూరిజం తదితర శాఖల అధికారులతో ప్రత్యేకంగా చర్చించామన్నారు.. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్ళే విధంగా పూర్తి స్థాయిలో చర్చలు జరిగినట్లు మంత్రి దుర్గేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి డి.నరసింహకిషోర్, మున్సిపల్ కమిషనర్ కేతన గార్గ్, జెసి ఎస్.చిన్నరాముడు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కువైట్‌లో నిర్బంధానికి గురైన మహిళకు విముక్తి

### ఎంఎల్‌ఎ మద్దిపాటికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబం

ప్రజాశక్తి-నల్లజర్ల

కువైట్‌లో నిర్బంధానికి గురైన మహిళ చిలకా నిర్మలకు విముక్తి కలిగింది. 16 నెలలు క్రితం చిక్కుకున్న ఆమె ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు చొరవతో తిరిగి ఇంటికి చేరుకుంది. ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన చిలక నిర్మల నకిలీ ఏజెంట్ మాటలు విని మోసపోయి కువైట్‌లో చిక్కుకుంది. ఒక ఇంట్లో పనికి కుదిరింది. ఈ సమయంలో వారి వేధింపులకు గురైంది. విషయాన్ని సర్పంచ్ కొత్తూరి జాన్‌విక్టర్‌బాబుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వెంటనే ఆయన ఎఎంసి చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు సహకారంతో ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎంఎల్‌ఎ మద్దిపాటి మంత్రి నారా లోకేష్‌కు తెలిపారు. అక్కడ భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి నిర్మలను గ్రామానికి తీసుకొచ్చారు. తనను కాపాడిన మంత్రి లోకేష్, ఎంఎల్‌ఎ వెంకటరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలుపుకుంది. వారికి జీవితాంతకాలం రుణపడి ఉంటానని తెలిపింది.



పాలాభిషేకం చేస్తున్న బాధితురాలు నిర్మల

### సత్యనారాయణరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఇపిఎఫ్ పెన్షనర్ల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన చుక్కన సత్యనారాయణరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం సుందరయ్య భవన్‌లో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, వర్మ, అయితాబత్తుల రామేశ్వరరావు సత్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సత్యనారాయణరాజు ఉపాధ్యాయునిగా ఏజెన్సీలోనూ సేవలు అందించారని, సంఘంలో ఏ బాధ్యతల్లో ఉన్నా అంకిత భావంతో పనిచేసారని గుర్తు చేశారు. ఆయన సమాజ సంక్షేమం కోసం అహర్నిశలు పని చేశారన్నారు. స్వతహాగా కళాకారుడైన సత్యనారాయణరాజు క్రమశిక్షణలో ముందుపీఠిన నిలిచారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జీ, సిహెచ్.రాజ్‌కుమార్, నాయకులు యు.సత్యనారాయణ, మలకా వెంకట రమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, కె.వీరబాబు, చంద్రమళ్ల పద్మ, సిహెచ్.సతీష్, ఎం.హరనాథ్, కరణం విశ్వనాథం, రొంగల ఈశ్వరరావు, సిహెచ్‌వి.రమణ, టి.రాజా, పి.రామకృష్ణ, కె.సత్యనారాయణ, రాణి, పద్మ, రవికుమార్, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

### కోట సత్తెమ్మను దర్శించుకున్న బూరుగుపల్లి

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో కోటసత్తెమ్మను ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఆయన వెంట సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ తదితరులున్నారు.

### ప్రజలకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-కడియం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మాధవరాయుడు పాలెం ప్రజలకు సర్పంచ్ అన్నందేవుల చంటి శనివారం పలురకాల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గొల్లపల్లి శ్రీనివాస్, నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, పడాల బాబి, అన్నందేవుల రాముడు, పాఠంశెట్టి వీర్రాజు, బొల్లా ధనుంజయ, ఎండపల్లి అప్పలపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు అందజేస్తున్న సర్పంచ్ చంటి

### ఘనంగా రేగులమ్మ జాతర

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని పెద్దాపురం గ్రామంలో గ్రామదేవత రేగులమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. శనివారం డప్పు వాయిద్యాల నడుమ గరగలతో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పులు, తీన్మార్, వివిధ కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులతో పాటు వారి బంధువులు, చుట్టు పక్కల గ్రామాల వారు ఈ జాతరలో పాల్గొన్నారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### బూరుగుపల్లి శేషారావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన బూరుగుపల్లి శేషారావుకు పలువురు శనివారం అభినందనలు తెలిపారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వేలివెన్నులోని శేషారావు స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్చం, వెంకటేశ్వర స్వామి చిత్రపటం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట తణుకు ఎఎంసి మాజీ చైర్మన్ బసవ రామకృష్ణ, నల్ల భాస్కరరావు, చుంచుల వెంకటేశ్వరరావు, కొండేటి శివ, ఉండ్రాజవరం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జులు ముళ్లపూడి పాండురంగారావు, ఈర్పిన సత్యనారాయణ, హరిశ్చంద్ర ప్రసాద్ తదితరులున్నారు.



శేషారావుకు జ్ఞాపికను ఇస్తున్న రాధాకృష్ణ తదితరులు